క్లుప్తంగా

పరిశోధనలతో దేశ అభివృద్ధి



ప్రసగింస్తున్న ఆచార్య బీవీ మురళీధర్

మద్దిలపాలెం : దేశ అభివృద్ధికి సామాజిక శాస్త్రాల అధ్యయనం, పరిశోధనలు ఎంతో దోహదపడతాయని ఆచార్య బి.వి.మురళీధర్ అన్నారు. ఏయూ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం ఆధ్వర్యంలో బుధవారం బహుళ విభాగాల పరిశోధనలో వినూత్న దిశలు అనే అంశంపై అతిథి ఉపాన్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య మురళీధర్ ప్రసంగిస్తూ ప్రభుత్వాలు ఇలాంటి పరిశోధనలు జరిపించాలని సూచించారు. వీటికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సామాజిక శాస్త్రంతోపాటు అన్ని రంగాల్లో పరిశోధనలు జరిగితే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వానరం హల్ చల్



అగనంపూడి: దువ్వాడ కాలనీలో వానరం ఇళ్లల్లోకి, మేడల మీద హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వానరాన్ని పట్టుకొని జూకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం హక్కులు హరించేందుకే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. అదే విధంగా స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాల ప్రైవేటీకరణ ఉపసంహరించాలన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, పి.వి. రమణమూర్తి, యు. రామస్వామి, బి. శ్రీనివాసరాజు, డి.వి. రమణ, సురేష్‌బాబు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పట్టాభిరామ్

సీతంపేట: బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం వ్యక్తిత్వ వికాస నిపుణుడు, హిప్నాటిస్ట్, కౌన్సిలర్, ఇంద్రజాలికుడు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి సంఘ సేవకుడు భరణికాన రామారావు, సీనియర్ మెజీషియన్ కె.విజయ్‌కుమార్, బాలవికాస్ ఫౌండేషన్ కన్వీనర్ నరవ ప్రకాశరావు, గాంధీ సెంటర్ సంయుక్త కార్యదర్శి కె.వి.ఎస్.మూర్తి, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు కాశీవిశ్వేశ్వరరావు తదితరులు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పట్టాభిరామ్‌తో తమకున్న అనుబంధం, అనుభవాలను మిగిలిన వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా భరణికాన రామారావు మాట్లాడుతూ పట్టాభిరామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, తనదైన రంగంలో అంతర్జాతీయ గుర్తింపు పొందారన్నారు.


అప్పు చేస్తేనే పప్పు కూడు





32వ వార్డు గోవిందరోడ్డు రేషన్ డిపో వద్ద

- రేషన్ డిపోల్లో అందని కందిపప్పు
- నో స్టాక్ అంటూ ఏడాదిగా కూటమి పాట
- కందిపప్పు కూడా ఇవ్వలేని ప్రభుత్వంపై గరంగరం
- తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు





అల్లిపురం అమ్మవారి వీధి రేషన్ డిపో వద్ద లబ్ధిదారులు

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ డిపోల ద్వారా నాణ్యమైన బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు వంటి నిత్యావసరాలు సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా కందిపప్పు జాడలేదని రేషన్ వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే రేషన్ డిపోల ద్వారా పలు సరుకులు తక్కువ ధరకే అందిస్తామని గొప్పలు చెప్పుకుంది. కానీ ఆ హామీ అటకెక్కిందని ప్రజలు విమర్శిస్తున్నారు. కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ. 150 నుంచి రూ.160 వరకు పలుకుతుండటంతో, కొనుగోలు చేసే స్తోమత లేక వారు నిట్టూరుస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా కిలో రూ.67కి కందిపప్పు పంపిణీ చేసేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని నెలలు అరకొరగా పంపిణీ చేసి ఆపేశారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనవరిలో కొద్ది మందికి, ఫిబ్రవరిలో బియ్యంతో పాటు కొంతమందికి పంచదార మాత్రమే ఇచ్చి సరిపెట్టారని, మార్చి నుంచి జూలై వరకు కందిపప్పు సరఫరా చేయకపోవడంతో తెల్లకార్డుదారులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. రేషన్ సరుకులపైనే ఆధారపడి జీవిస్తున్న పేదలు కందిపప్పు తినాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.

నిత్యావసరాలకు రెక్కలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు అమాంతంగా పెరిగాయని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా కందిపప్పు ధర భారీగా పెరగడంతో, రేషన్ దుకాణాల ద్వారా అందుతుందని ఆశించిన పేదల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని మండిపడుతున్నారు. ప్రస్తుతం ప్రతి నెలా కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారని, ఎన్నికల హామీలు అమలుపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. వరుసగా నాలుగు నెలలుగా బియ్యం, చక్కెర తప్ప మిగిలిన సరుకులు ఇవ్వడం లేదని, కందిపప్పు ఎప్పుడు వస్తుందో తెలియక రేషన్ డిపోదారులను నిలదీస్తే, 'నో స్టాక్' అంటూ చెబుతున్నారని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు.

కందిపప్పు ఇవ్వడం లేదు



బియ్యంతో పాటు పంచదార మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు ఇవ్వడం లేదు. అసలే మార్కెట్లో నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం కూడా పేదలకు రేషన్ ద్వారా సరుకులు సక్రమంగా అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు పంపిణీ చేసే ఏర్పాటు చేయాలి.
– రాజేశ్వరి, మహారాణిపేట

ఇలా అయితే ఎలా..



ప్రభుత్వం రేషన్ సరుకులు పేదలకు పూర్తి స్థాయిలో పంపిణీ చేయడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, గోధుమ పిండి తదితర సరకులు ప్రతి నెల పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బియ్యం, పంచదార ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ప్రతి నెల కందిపప్పు రాలేదని డీలర్లు చెబుతున్నారు.
– నాగమణి, దిబ్బలపాలెం

కుటుంబం చెంతకు ఒడిశా మహిళ



బాటసెబ పనిని ఆమె మేనల్లుడు జనసన చంద్ర పనికి అప్పగించిన శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధులు


అల్లిపురం: పాము కాటుతో మానసిక స్థితిని కోల్పోయి నెల రోజుల క్రితం ఇల్లు వదిలి వచ్చిన ఒడిశాకు చెందిన 60 ఏళ్ల బాటసెబ పనికి వైజాగ్‌లోని ఏయూటీడీ సిబ్బంది ఆశ్రయం కల్పించి, చికిత్స అందించారు. ఆమె మానసిక ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత, ఏయూటీడీ సిబ్బంది ఆమె వివరాలు తెలుసుకొని, శ్రద్ధా ప్రతినిధుల ద్వారా ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లాలోని గుమ్మ గ్రామంలోని ఆమె కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, బాటసెబ పనికి పెళ్లి కాలేదు. ఆమె తన మేనల్లుడు, మేనకోడలిని బాగా చదివిస్తూ, వారితోనే నివసిస్తోంది. చర్చిలో ఉపన్యాసాలు ఇస్తుండేది. అనుకోకుండా పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మానసిక సమస్యలు మొదలయ్యాయి. దీంతో ఆమె ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలి వచ్చేసింది. వైజాగ్‌లో ఆమెను గుర్తించిన ఏయూటీడీ సిబ్బంది, తమ షెల్టర్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు. చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో, శ్రద్ధా సోషల్ వర్కర్ల సాయంతో వైజాగ్ నుండి నేరుగా ఆమె స్వగ్రామానికి తీసుకెళ్లి, ఆమె మేనల్లుడు జనసన చంద్ర పనికి అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

గోపాలపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ బుధవారం ఎన్ఏడీ మెయిన్ గేటు ఎదుట ఐఎన్‌టీయూసీ నాయకులు ధర్నా చేపట్టారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా ఎన్ఏడీ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పాతపెన్షన్ స్కీమ్ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని, లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు సత్యదేవునికి పౌర్ణమి పూజలు





రమాసహిత సత్యనారాయణస్వామి, సత్యనారాయణ స్వామి ఆలయం

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి. రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. భక్తులు సామూహిక వ్రతంలో పాల్గొని, సత్యదేవుని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. పౌర్ణమి విశిష్టత దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పి. నరసింహాచార్యులు నేతృత్వంలో వేద పండితులు వేకువజాము నుంచే భక్తుల ప్రదక్షిణ, వ్రతాచరణకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని ఈవో వివరించారు.

ద్విమూర్తుల దర్శనం : ఓ గొప్ప విశేషం

పూర్వం ఉత్తరాది ప్రాంతానికి చెందిన బాబాజీ అనే రుషి లోక కల్యాణం కోసం, ప్రజల కష్టాలు తీరి సిరి సంపదలు, సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలనే ఆశయంతో ఈ ప్రాంతానికి వచ్చారు. నగరంలోని కేజీహెచ్‌కు సమీపంలో ఉన్న బాబాజీ కొండపై సత్యనారాయణ స్వామి పాదాలను ప్రతిష్ఠించి, ఆరు పౌర్ణమిల పాటు ప్రదక్షిణ చేసి వ్రతం ఆచరించడం ద్వారా భక్తులు కోరిన కోరికలు తీరుతాయని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాది సంప్రదాయం ప్రకారం పాలరాతి ధ్రువ మూర్తిని సైతం ప్రతిష్ఠించారు. కాలక్రమేణా ఈ క్షేత్రం ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. శిథిలమైన పూర్వపు ఆలయాన్ని తొలగించి, కనకమహాలక్ష్మి ఆలయ నిధులతో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని పునర్నిర్మించారు. పునరుద్ధరణలో భాగంగా దక్షిణాది సంప్రదాయాన్ని అనుసరించి నల్లరాతి ధ్రువమూర్తులను ఏర్పాటు చేయడంతో, ఇక్కడ ద్విమూర్తుల దర్శనం ఒక గొప్ప విశేషంగా మారింది.

స్వామి పాదాల దిగువన వంటశాల ప్రాశస్త్యం

ఈ ఆలయంలో మరో విశేషం ఏమిటంటే, స్వామి పాదాలకు దిగువన, అంటే కొండ కింద భాగంలో ఏర్పాటు చేసిన వంటశాలలో ప్రసాదాల తయారీ చాలా ప్రాశస్త్యమైనదిగా భక్తులు భావిస్తారు.

మావోయిస్టులకు ఐజీ హెచ్చరికపై భగ్గుమన్న పౌర సంఘాలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ప్రజాసంఘాల పౌరవేదిక ప్రతినిధులు

అల్లిపురం: బస్తర్ ఐజీ సుందర్ రాజ్ మావోయిస్టులను ఉద్దేశించి చేసిన 'లొంగిపోండి లేదంటే చంపేస్తాం' అనే ప్రకటనను పౌర ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. బుధవారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌర సంఘాల నాయకులు ఈ వ్యాఖ్యలు చేశారు. పౌర సంఘాలు నేతలు మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న హత్యాకాండను ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశాయి. ఆదివాసీ నిరసన శిబిరాల్లో ఉన్నవారిని సైతం మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే పేరుతో కాల్చి చంపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో కనీసం బస్సులు కూడా లేని చోట ఆరు లైన్ల రోడ్ల నిర్మాణం చేపట్టి, 350కి పైగా భద్రతా క్యాంపులను పెట్టి ఆదివాసుల భూములను లాక్కుంటున్నారని, విద్య, వైద్యం, సంతల నిర్వహణ లేకపోవడం వంటి అనేక విధాలుగా వారిని నిర్బంధిస్తున్నారని పౌర సంఘాలు ఆరోపించాయి. ఆదివాసీలు పోరాడి సాధించుకున్న ఫిఫ్త్ షెడ్యూల్, అటవీ సంరక్షణ చట్టం 2006, పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ యాక్ట్ (పీసా యాక్ట్) వంటి అన్ని చట్టాలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని ఆరోపించారు. అడవుల నుండి ఆదివాసీలను బయటకు గెంటే కుట్రను ప్రభుత్వం చేపడుతోందని, ఈ కుట్రలను 'ఆపరేషన్ కగార్' పేరుతో చేస్తున్న నరహంతక మారణకాండను అభ్యుదయవాదులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని పౌర ప్రజా సంఘాల వేదిక డిమాండ్ చేసింది. కార్యక్రమంలో పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లలిత, న్యాయవాది పద్మ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కసిరెడ్డి సత్యనారాయణ, ఐఐటీయూసీ జిల్లా నాయకులు ఎస్‌కే రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే అచ్యుత్ రావు, ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెయ్యల నాగభూషణరావు, సీపీఐ ఎంఎల్ ప్రజా పోరు నాయకులు దేవా తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ సిటీ..డర్టీ పిక్చర్



చెంగల్రావుపేట పంజా జంక్షన్ వద్ద మరమ్మతులకు గురైన పైపులైన్



టౌన్‌కొత్తరోడ్డు వద్ద పరిస్థితి ఇదీ..

దాబాగార్డెన్స్: ఒకప్పుడు విశాఖకు తలమానికంగా వెలుగొందిన పాతనగరం ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలక్ష్యంతో దీనావస్థకు చేరుకుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టించుకునే నాథుడే లేక పాతనగరం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కనీసం అటువైపు కూడా రావడం లేదని విమర్శిస్తున్నారు. అధికారులైతే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టౌన్ కొత్తరోడ్డు వద్ద కల్వర్టు పనులు ప్రారంభించి దాదాపు ఆరు నెలలు దాటినా ఇప్పటికీ కొలిక్కి రాలేదు. ఫలితంగా ఎగువ ప్రాంతాల ప్రజలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. పైగా, కాల్వల్లో చెత్తాచెదారం నిండిపోవడంతో తాగునీటి పైపులైన్ల ద్వారా మురుగునీరు సరఫరా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఈ సమస్యను కూడా పట్టించుకోవడం మానేశారని ఆరోపిస్తున్నారు.

తాజాగా చెంగల్రావు పేట బజారు వద్ద చేపట్టిన పైపులైన్ పనులు సరిగ్గా చేయకపోవడంతో పెద్ద పైపుల నుంచి నీరు ఉవ్వెత్తున ఎగసిపడింది. ఆ నీరంతా పరిసర ప్రాంతాల కాల్వల్లోకి చేరి, ఎక్కడికెక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం మంగళవారం బయట పడింది. దీంతో రోడ్లన్నీ చెత్తాచెదారంతో నిండిపోయి, మురుగునీరు ప్రవహిస్తుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తక్షణమే అధికారులు స్పందించి పాతనగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



జగన్నాథస్వామి ఆలయం వద్ద మురుగు

గిరి భక్తులకు ప్రసాద వితరణ



భక్తులకు వేడి బాదంపాలు, బిస్కెట్స్ అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో..

దాబాగార్డెన్స్: సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టాయి.

జీవీఎంసీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఇందులో భాగంగా వేడి బాదంపాలు, బిస్కెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు

స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జోడుగుళ్లపాలెం వద్ద గిరి ప్రదక్షిణ భక్తులకు విస్తృతంగా సేవలందించారు. వారు బిస్కెట్ ప్యాకెట్లు, రాగి జావ, కాళ్ల నొప్పులు, జ్వరం మందులు, అమృతాంజన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోడుగుళ్లపాలెం గ్రామ కుల పెద్ద ఉమ్మడి పెద్ద దాసు, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు బండారి గజపతిస్వామి, డి. సత్తిబాబు, నాగరాజు, ఎస్. రమాప్రియ, రమేష్‌నాయుడు, డి. సావిత్రి, పి. కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

విమ్స్ కిటకిట

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) రోగులతో కిటకటలాడుతోంది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు భారినపడుతున్న వారు విమ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. వీరిలో కొద్ది రోజులుగా జ్వరాలు భారిన పడుతున్నవారు ఎక్కువగా ఉన్నారు. వారం రోజులగా ఓపీ సుమారు 800 దాటుతుంది. జ్వరాలతో పాటు మలరియా, టైఫాయి డ్, డెంగ్యూ బాధుతులు నమోదవుతున్నారు. ఇక్కడ సాధారణ జ్వరాలతో పాటు డెంగ్యూ, మలేరియాతో బాధపడుతున్నవారు ఇటీవల ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్సలు పొందుతున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్, జనరల్, కార్డియాలీ, ఈఎన్‌టీ తదితర వాటితో పాటు జ్వరాలుతో వచ్చే రోగులతో రోజూ ఓపీ నమోదువుతుంది. జ్వరాలతో వెళ్లేవారికి రక్త పరీక్షలు నిర్వహించడంతో జ్వరాలతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది.

రైల్వే కార్మికుల సమస్యలపై ధర్నా



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం వద్ద రైల్వే కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె సంపత్‌కుమార్ మాట్లాడుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్ జనరల్ సెక్రటరీ ఎం.రాఘవయ్య పిలుపు మేరకు ధర్నా చేసినట్లు తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా, అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలో మెమోరండం సమర్పించినట్లు చెప్పారు. శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ టి.వి.మౌళి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైల్వేలో పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, రైల్వేల్లో ప్రైవేటీకరణ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలను ఆపాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఆర్‌ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నటు తెలిపారు.